క్లుప్తంగా

అగ్నిప్రమాద బాధితురాలికి ఎంపీ ఎంవీవీ పరామర్శ



ఆస్పత్రిలో మహిళను పరామర్శిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: అగ్నిప్రమాదంలో గాయపడిన మహిళను విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ బుధవారం పరామర్శించారు. జీవీఎంసీ పదకొండో వార్డు టీవీసీ పాయింట్ వేంకటేశ్వర స్వామి ఆలయం సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో తేజేశ్వరి ప్రమాదానికి గురై, చికిత్స పొందుతోంది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆమె నివాసానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆమెకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఆర్‌వో ప్లాంట్ వితరణ

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీలోని వీఎంసీ కళాశాలకు వాసవీ క్లబ్ ఎంవీపీ కపుల్స్ ఆధ్వర్యంలో ఆర్‌వో ప్లాంట్ వితరణగా అందజేశారు. ఈ ప్లాంట్‌ను ఆ క్లబ్ ప్రతినిధుల సమక్షంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగదీశ్వరరావు ప్రారంభించారు. విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చేందుకు ప్లాంట్ ఏర్పాటు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు చెరుకు కృష్ణతో పాటు కళాశాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత ప్రదర్శన

ఎంవీపీ కాలనీ: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంవీపీ కాలనీ సెక్టార్ – 6లోని శ్రీ వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించిన శాస్త్రీయ సంగీత, వీణా కచేరీ ఆకట్టుకుంది. శ్రీశ్రీ మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు ప్రదర్శన నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు. భక్తులు కరతాళధ్వనులు, గోవిందనామ స్మరణతో అకాడమీ విద్యార్థులను ప్రోత్సహించారు.

బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన



మహిళలకు బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ బృందం

మద్దిలపాలెం: బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన తప్పనిసరి అని కుశాల్ ప్రాజెక్ట్ మహిళా మండలి ప్రతినిధులు అన్నారు. జీవీఎంసీ 16వ వార్డులో ఇసుకతోట రజకవీధిలో బుధవారం అవగాహన కల్పించారు. రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలో గుర్తిస్తే 90శాతం నయమవుతుందని తెలియజేశారు. రొమ్ము స్వీయ పరీక్ష పద్ధతులను వివరించారు. నెలలో ఒక సారి స్వీయ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రతినిధుల బృందం భవాని, వరలక్ష్మి, పార్వతి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



చిన్నారుల నృత్య ప్రదర్శన

బీచ్‌రోడ్డు: ఆర్కే బీచ్ కాళీమాత దేవాలయంలో ఏర్పాటు చేసిన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మయూరి నిత్యనికేతన్ ఆధ్వర్యంలో చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ప్రతీ రోజు దేవాలయంలో ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నామని దేవాలయం నిర్వాహకులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ



సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ, కార్పొరేటర్ సునీత



ఎస్‌ఎస్‌ఎన్ నగర్‌లో వృద్ధురాలికి కరపత్రం అందిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ తెలిపారు. జీవీఎంసీ 13వ వార్డులో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం స్థానిక కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు పరిధి ఎస్ఎస్ఎన్ నగర్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల ద్వారా ఎలా లబ్ధి పొందుతున్నారో ఆరా తీశారు. పేదల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. రానున్న ఎన్నికల్లో ఆయననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు నిత్యం ప్రజలతో కలిసి ఉంటూ వారి సమస్యలు తెలుసుకోవాలన్నారు. స్థానిక సమస్యలు సచివాలయం సిబ్బంది దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, వెంకటరెడ్డి, శ్రీను, గోవింద్, అప్పారావు, బంగారమ్మ, సచివాలయాల సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

18వ వార్డును మోడల్‌గా అభివృద్ధి చేస్తాం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డును మోడల్ వార్డుగా అభివృద్ధి చేస్తానని ఎంపీ, తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. అప్పుఘర్‌లో 18వ వార్డు పార్టీ కార్యాలయాన్ని వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మితో కలిసి బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి చిరునామాగా మారిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజలంతా నిండు మనస్సుతో మరోసారి ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని అత్యధిక సీట్లతో గెలిపించాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమర్థవంతంగా సేవలందించాలని కోరారు. 18వ వార్డులో ఇప్పటికే రామాలయం, వినాయకుడి ఆలయాలను సొంత నిధులతో అభివృద్ధి చేసేందుకు హామీ ఇచ్చినట్లు తెలిపారు. దీంతోపాటు రూ.49 లక్షలతో వార్డులో సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బాబీరెడ్డి, సీనియర్ నాయకులు పుక్కళ్ల శంకర్, మొల్లి అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, పార్టీ 19వ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

సామాజిక భవనానికి శంకుస్థాపన

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో శ్రీకాంత్‌నగర్ దరి జేఎన్ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో సామాజిక భవనం నిర్మాణానికి ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ వార్డు కార్పొరేటర్ కెల్ల సునీతతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీ ప్రజల అవసరాల కోసం రూ.25 లక్షల ఎంపీ నిధులతో సామాజిక భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. పనులు త్వరగా పూర్తి చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కెల్ల సత్యనారాయణ, పిల్లి వీర్రాజు, బోని శివరామకృష్ణ, దుర్గారావు, పోలరావు, అప్పలనాయుడు, శిరీష, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతో డెంగ్యూ నియంత్రణ

- పక్కాగా ఇంటింట సర్వే
- మలేరియా నివారణ అధికారి తులసి



కేఆర్‌ఎం కాలనీలో సంప్ పరిశీలిస్తున్న జిల్లా మలేరియా నివారణ అధికారి తులసి

మద్దిలపాలెం : డెంగ్యూ నియంత్రణకు మహానగర పాలక సంస్థ మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింట సర్వే పక్కాగా నిర్వహించాలని జిల్లా మలేరియా నివారణ అధికారి ఎం.తులసి ఆదేశించారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎం కాలనీలో సర్వే చేస్తున్న సిబ్బంది పనితీరును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా గృహాల్లోని ఫ్రిడ్జ్‌ల వెనుక నిల్వ నీరు తొలగించే ప్రక్రియను దగ్గరుండి పరిశీలించారు. అలాంటి నీటిలోనే లార్వా పెరుగుతుందని, దోమలు ఉత్పత్తి చెందుతాయని కాలనీ వాసులకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం జీవీఎంసీ, సచివాలయం, ఆరోగ్య సిబ్బంది నిర్వహించే డ్రై డే – ఫ్రై డే కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ నివారణ సాధ్యమవుతుందన్నారు. అనంతరం కాలనీలో ఇళ్ల పరిసరాలను, నిర్మాణంలో వున్న భవంతుల వద్ద సంప్‌లను పరిశీలించారు. సంప్‌లలో ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి నగేష్ పట్నాయిక్, ఆరోగ్య కార్యకర్తలు కె.ఎస్.శ్రీనివాసరెడ్డి, శేషుబాబు, ఎల్.శ్రీను, కోదండరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో ఆధ్వర్యంలో సాగరతీర స్వచ్ఛత



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న ఉద్యోగులు, విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛత హీ సేవ – స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం విశాఖ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఏయూ ఐఏఎస్ఈ కళాశాల విద్యార్థులతో కలిసి తీరంలో శుభ్రం చేసినట్లు కేంద్రం డైరెక్టర్ ధర్మారావు తెలిపారు. ఇందులో భాగంగా విద్యార్థులు పలు చోట్ల చెత్త తొలగించారు. ఈ సందర్భంగా ధర్మారావు మాట్లాడుతూ స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇల్లు, కార్యాలయంతోపాటు అన్ని చోట్ల పరిశుభ్రత పాటించాలన్నారు. ఏయూ ఆచార్యులు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఆరిలోవ: ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమయింది. ఆరిలోవ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విశాలాక్షినగర్ దరి వైఎస్సార్ సీ వ్యూ పాయింట్ ఎదురుగా సీతకొండ అంచులో ఓ బండ రాయిపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు పోలీసులకు బుధవారం స్థానికుల నుంచి సమాచారం అందించింది. దీంతో పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. మండుటెండ కావడంతో రాయిపై ఉన్న ఆ మృతదేహం శరీరం పైభాగం నల్లగా మాడిపోయింది. కొన్నిచోట్ల బొబ్బలు తేలాయి.

మృతుని వయసు 55 సంవత్సరాలు ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారమూ లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతిగా కేసు నమోదు చేసి కేజీహెచ్ మార్చురీకి తరలించినట్లు సీఐ సోమశేఖర్ తెలిపారు. సంబంధీకులు పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

విద్యా సమాచారమ్

ఇంజినీరింగ్ విద్యార్థుల హాస్టల్ తనిఖీ



హాస్టల్‌లో విద్యార్థితో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ విద్యార్థుల హాస్టల్‌ను రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల గదులకు వెళ్లి వారితో మాట్లాడారు. గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దుస్తులు, పుస్తకాలు నిర్దేశించిన స్థానంలో ఉంచాలని సూచించారు. గదిలో ఏర్పాటు చేసిన అల్మారాలను వినియోగించాలన్నారు. కొంతమంది విద్యార్థులు ఉదయం 9.30 గంటల తరువాత కూడా హాస్టల్‌లో కనిపించడంతో వారిని పిలిచి మాట్లాడారు. తరగతులు ప్రారంభమయ్యే సమయానికి కళాశాలకు చేరుకోవాలన్నారు. కొంతమంది స్వల్ప అనారోగ్యంతో హాస్టల్‌లో ఉండటం గమనించి, వైద్యశాలకు వెళ్లాలని సూచించారు.

మెస్ పరిశీలన : విద్యార్థులతో కలసి మెస్‌లో ఆహార నాణ్యతను రిజిస్ట్రార్ పరిశీలించారు. విద్యార్థులకు నిత్యం అందించే ఆహారం మెనూ వివరాలు, నాణ్యత పరిశీలించారు. విద్యార్థులతో కలసి అక్కడే టిఫిన్ చేశారు. ఆహార నాణ్యతపై విద్యార్థుల సూచనలు స్వీకరించిన ఆయన సంబంధిత సిబ్బందిని పిలిచి మాట్లాడారు. వారం రోజులు చూస్తానని, భోజనం నాణ్యత పెంచాలని ఆదేశించారు. ఇకపై తరచూ హాస్టల్స్ తనిఖీ చేస్తామన్నారు. రిజిస్ట్రార్ వెంట ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు, ఆచార్య ఎల్.లక్ష్మీ నారాయణ, ఆచార్య కుంజం నాగేశ్వరరావు, సీఎస్‌వో తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మూక్ కోర్సులు ఉపయుక్తం



ఆచార్య విమల్ రాహ్‌ను సత్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి తదితరులు

ఏయూక్యాంపస్: మాసివ్ ఓపెన్ ఆన్‌లైన్ కోర్సులు (మూక్స్) విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని ఢిల్లీలోని ఎస్‌జీటీబీ ఖల్సా కళాశాల రసాయనశాస్త్ర ఆచార్యురాలు విమల్ రాహ్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర విభాగాన్ని బుధవారం సందర్శించిన ఆమె విద్యార్థులనుద్దేశించి ప్రత్యేకంగా ప్రసంగించారు. అనంతరం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీలో అందిస్తున్న కోర్సులు, స్టార్టప్, ఇంక్యుబేషన్ తదితర అంశాలను వీసీ వివరించారు. ఆచార్య విమల్ రాహ్ మాట్లాడుతూ ఈ లెర్నింగ్ విద్యార్థులకు సులభతరంగా నిలుస్తోందన్నారు. విద్యార్థులు అభ్యసిస్తున్న కోర్సుతో పాటు విభిన్న శాస్త్ర అంశాలను నేర్చుకోవడానికి, నూతన జ్ఞానాన్ని పొందడానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తున్న విధానాన్ని వివరించారు. యూజీసీ నిర్వహించిన ఒక ప్రాజెక్టులో భాగంగా తాను ఇ-కంటెంట్‌ని రూపకల్పన చేసి ఇచ్చిన విధానం తెలియజేశారు. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులైన ఆచార్యుల సహకారంతో విభిన్న శాస్త్ర అంశాల్లో ఈ-కంటెంట్‌ను అభివృద్ధి చేసి అందిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగపడగలదన్నారు. ఉన్నత మానవ వనరులు, మౌలిక వసతులు కలిగిన ఏయూ ఈ దిశగా ముందడుగు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, స్వయం నోడల్ అధికారిణి ఆచార్య కె.రమాసుధ, ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలకు సత్వర పరిష్కారం



సమావేశంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

ఏయూ క్యాంపస్: విద్యార్థుల సమస్యలకు సత్వర పరిష్కారం చూపే విధంగా యంత్రాంగం పనిచేస్తోందని ఏయూ విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్‌మోహన్ సూచించారు. బుధవారం ఏయూ క్రీడా విభాగంలో విద్యార్థుల ఫిర్యాదుల స్వీకరణ కమిటీ సమావేశం నిర్వహించారు. వర్సిటీలో నూతన విద్య సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో కొత్తగా వర్సిటీలో చేరిన విద్యార్థుల నుంచి వచ్చే సమస్యలు, ఫిర్యాదులను సానుకూలంగా స్వీకరించి, పరిష్కరించాలని కమిటీ సభ్యులు నిర్ణయించారు. విభాగంలో, హాస్టల్స్‌లో ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి విద్యార్థులకు అత్యంత ప్రాధాన్యమిస్తూ అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నారన్నారు. కమిటీ సభ్యులు నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు సమస్యలు లేకుండా పనిచేయాలని చైర్మన్ ఆచార్య విజయ్ మోహన్ సూచించారు. కార్యక్రమంలో ఆచార్య పి.వెంకటేశ్వర్లు, ఆచార్య ఎ.కె.ఎం.పవార్, ఆచార్య కె.రమా సుధ, ఆచార్య టి.వి.కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

డాబాగార్డెన్స్ : ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ విశాఖ డివిజన్ ఏర్పడి బుధవారం నాటికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా డివిజనల్ కార్యాలయం ఆవరణలో యూనియన్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షురాలు మల్లాది కామేశ్వరి, కార్యదర్శి వరప్రసాదరావు మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా కార్మిక సంక్షేమానికి, సభ్యుల అభ్యున్నతికి పని చేస్తున్నట్లు తెలిపారు. 1974 అక్టోబర్ 18న మచిలీపట్నం డివిజన్ నుంచి విశాఖపట్నం డివిజన్ ఏర్పడిందన్నారు. 74లో ప్రెసిడెంట్‌గా పని చేసిన రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యుడు ఎస్. కృష్ణమూర్తి మాట్లాడుతూ సంస్థ ఉన్నతికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా స్వర్ణ జయంత్యుత్సవ లోగో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీ మహాలక్ష్మి .. నమోస్తుతే



అన్నపూర్ణాదేవిగా లలితాదేవి



మహాలక్ష్మిగా దుర్గమ్మ దర్శనం



అన్నపూర్ణాదేవిగా భూలోకమాత

- కనులపండువగా శరన్నవరాత్రి ఉత్సవాలు
- ప్రత్యేక అలంకరణల్లో దేవతామూర్తులు

ఏయూ క్యాంపస్: శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఆలయాలు ఆధ్యాత్మిక కాంతులను వెదజల్లుతున్నాయి. ఉత్సవాల్లో నాలుగో రోజు బుధవారం దుర్గాదేవిని మహాలక్ష్మి దేవిగా అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు విశేష సంఖ్యలో హాజరై, అమ్మవార్లను దర్శించుకుంటున్నారు. పెదవాల్తేరులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలోని దుర్గాదేవి మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో అలంకరించారు. పోలమాంబ అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చారు. ఆలయంలోని పోలమాంబ, కుంచమాంబ, నీలమాంబ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- ఏయూ అవుట్‌గేట్ వద్దనున్న లలితా పీఠంలో లలితా త్రిపుర సుందరి అమ్మవారిని శ్రీ అన్నపూర్ణదేవిగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. వివిధ పుష్పాలు, కూరలతో అమ్మవారిని, ఆలయాన్ని అలంకరించారు. ఉదయం పంచామృత అభిషేకం, సహస్ర కుంకుమార్చన శ్రీ చక్రార్చన, చండీ హోమం, శ్రీ శాకంబరి దేవి ప్రత్యేక పూజలు జరిపారు. సాయంత్రం శ్రీ అన్నపూర్ణ దేవి ఆవరణార్చనతో శ్రీ చక్రార్చన, నక్షత్ర దీపాలంకరణ సేవ, మంగళహారతి జరిపారు.

అలరించిన కూచిపూడి నృత్యాలు

శరన్నవరాత్రి ఉత్సవాల ధర్మ ప్రచార వారోత్సవాలలో భాగంగా బుధవారం చందన డాన్స్ అకాడమీ చిన్నారుల నృత్య ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.గాయత్రి, ఆలయ చైర్మన్ శంకర రెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు,

శ్రీ మహాలక్ష్మిగా చండికాదేవి

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–4లోని చండికాదేవి ఆలయంలో మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన కోలాటం, సంగీత కచేరీ అలరించాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు పొట్టి రమణ, కార్యదర్శి ఉమాదేవి, కమిటీ ప్రతినిధులు పీవీ శ్రీహరిరాజు, శిష్ట రామకృష్ణమూర్తి, రామకృష్ణ, కొండలరావు, రామ్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీనగర్‌లో వారాహి అవతారంలోని దుర్గాదేవిని దర్శించుకుంటున్న ఎంపీ ఎంవీవీ

వారాహి మాతగా దుర్గాదేవి

ఆరిలోవ: జీవీఎంసీ పదకొండో వార్డు పరిధి గాంధీనగర్‌లో దుర్గాదేవిని వారాహి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారి బుధవారం విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గొలగాని శ్రీనివాస్, బొండా శ్రీనివాస్, కార్యకర్తలతో కలసి ఆయన ఇక్కడ అమ్మవారికి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అన్నపూర్ణాదేవిగా భూలోమాత

మద్దిలపాలెం: భూలోక మాత అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మద్దిలపాలెం సీఎంఆర్ సెంట్రల్‌కు సమీపంలోని ఆలయంలో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల కోలాటం

మద్దిలపాలెం: పీతవానిపాలెంలో శ్రీ కృష్ణా యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా దుర్గాదేవి మండపం వద్ద చిన్నారుల కోలాటం అలరించింది. భక్తిగీతాలకు లయబద్ధంగా చేసిన కోలాటం ఆకట్టుకుంది.

ఎంవీపీ కాలనీ: దుర్గాదేవి దేదీప్యమానంగా దర్శనమిచ్చారు నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 17వ వార్డులో దుర్గాదేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలు ఈ కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారి ఆకృతిలో రంగవల్లికను తీర్చిదిద్ది, దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. నెక్కంటి సత్తిబాబు, చినిపల్లి నరేంద్ర, పిడింట్ల శ్రీనివాస్‌రెడ్డి, అప్పలరెడ్డి, భారతి, నందిని తదితరులు పాల్గొన్నారు.



దీపాలంకరణలో అమ్మవారి ప్రతిరూపం



పోలమాంబ ఆలయంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

చేనేత వస్త్రాలను ప్రోత్సహించాలి



చీరలు పరిశీలిస్తున్న మహిళలు

బీచ్‌రోడ్డు: భారతీయ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలను ప్రజలు ఆదరించాలని మిస్సెస్ వైజాగ్ – 2023 సాక్షి బజాజ్ అన్నారు. బీచ్ రోడ్డులోని నోవాటల్‌లో ఏర్పాటు చేసిన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శనను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులు నేటి యువతను ఆకర్షిస్తున్నాయన్నారు. చేనేత కార్మికుల కష్టానికి తగ్గ ఫలితం ఇచ్చేందుకు వారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. నిర్వాహకులు జయేష్ గుప్తా మాట్లాడుతూ ఈ ప్రదర్శన ఈ నెల 22 వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.